క్లుప్తంగా

నేడు మెగా జాబ్ మేళా

గంగారం: మంత్రి సీతక్క ఆదేశాల మేరకు నేడు (బుధవారం) ములుగులో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావులు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాకు 58కంపెనీలు రానున్నట్లు తెలిపారు. 7తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులన్నారు. నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళాకు వాహన సౌకర్యం..

కొత్తగూడ: ములుగులో జరిగే మెగా జాబ్ మేళాకు కొత్తగూడ మండలం నుంచి వెళ్లే నిరుద్యోగులకు మండల కేంద్రం నుంచి ఉచిత వాహనాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు. వెళ్లాలనుకునే నిరుద్యోగులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. జాబ్‌మేళాకు తీసుకెళ్లి తీసుకువస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేసముద్రం: ఎస్ఎన్‌కేడీఎం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ మండల ముఖ్యకార్య నిర్వహణ అధికారిగా పని చేయుటకు, తాత్కాలిక ఉద్యోగ నియామకానికి గాను అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎఫ్‌పీసీ చైర్ పర్సన్ మెట్టు ఉమాదేవి, ఏపీఎం రాజీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఈనెల 22వ తేదీ వరకు అభ్యర్థులు తమ వివరాలను తెలియజేస్తూ దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడి

కురవి: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వడం లేదని మద్యం మత్తులో కొడుకు తల్లిపై దాడి చేసిన సంఘటన సీరోలు మండలం రేకుల తండా గ్రామంలో జరిగినట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. సీరోలు మండలం రేకుల తండా గ్రామానికి చెందిన తేజావత్ కిషన్ అనే వ్యక్తి కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. రోజు తాగి వచ్చి భార్యతో గొడవపడుతుండగా కొన్ని నెలల క్రితం తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి తాగడానికి డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవపడ్డాడు. తల్లి వీరమ్మ తలుపు వేసుకుంటుండగా కొడుకు కిషన్ దాడి చేసి కొట్టాడు. దీంతో తల్లికి ముఖంపై గాయమైంది. మంగళవారం తల్లి వీరమ్మ ఫిర్యాదు చేసినట్లు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళాలు

గార్ల: గార్ల సమీపంలోని మద్రిగూడెం వేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు ఎన్నారై పులి గోపాల్‌రెడ్డి ప్రమీల దంపతులు రూ.1,50,000 విరాళం అందజేశారు. అదే విధంగా బుద్ధారం గ్రామానికి చెందిన రావూరి వెంకట్రామయ్య రూ.50,116, రావూరి మోహన్‌రావు, కందగట్ల రామారావు చెరో రూ.51,116, ఎం.రామారావు, పి.వేణుగోపాల్ చెరో రూ.25,116, పుల్లఖండం రమేష్‌బాబు, భూక్యా రాములు, ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్, పి.శ్రీనివాసరావు చెరో రూ.11,116, ఎం.జీవన్‌లాల్ రూ.10,116, మూడు అశోక్ రూ.6,116, అజ్మీర ప్రతాప్‌సింగ్, గుండా వెంకట్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌గుప్తా, ఒబిలిశెట్టి కృష్ణ చెరో రూ.5,116 అందజేసినట్లు అర్చకుడు రామాచార్యులు బుధవారం తెలిపాడు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



గంగారం: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి ఉదయ్ అన్నారు. మండల కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల షాపులను మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను, స్టాక్‌లను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మకాలు చేయాలని, రైతులకు విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రశీదులను అందించాలన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

డోర్నకల్: డోర్నకల్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ కాలా మోనికాయశోధర్‌జైన్ కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. డోర్నకల్‌లో రెండు నెలలుగా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై అడ్మిషన్లతోపాటు అనేక ప్రవేశ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఆధార్ సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున అధికారులు వెంటనే స్పందించి డోర్నకల్‌లో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26వేలు, హెల్పర్లకు రూ. 21వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథి రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్‌హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారీశ్వరీ అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీడీపీఓ రాజ్యలక్ష్మీకి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్లకు నూతన భవనాలు నిర్మించాలని, అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చెల్లించాలన్నారు. సమ్మె కాలంలో వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న అద్దె, గ్యాస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ లలిత, కీసర సామ్యశ్రీ, పెరుగు వరలక్ష్మీ, రజియా, శివకుమారి, పద్మ, స్వప్న, భానుమతి, ఏఐటీయూసీ నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, నర్ర శ్రావణ్ పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: సీడీపీఓకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపెల్లి నవీన్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు చిత్రలక్ష్మి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని ఐసీడీఎస్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏల్లమ్మ, మంద శంకర్, బందు మహేందర్ పాల్గొన్నారు.



తొర్రూరు: వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

షెడ్యూల్ ప్రకారం బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరునాయక్

గార్ల: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రోస్టర్ విధానం అమలు చేసి పదోన్నతులు కల్పించాలని ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బానోత్‌వీరునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం గార్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, షెడ్యూల్ ప్రకారం బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. జీఓ నంబర్ 317 ద్వారా ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.శివనాయక్, భాస్కర్, భోజ్యా నాయక్, వీరు, బి.శివ, నాగేశ్వరరావు, శ్రీను, రమేష్, వీరన్న, జుగల్ కిశోర్, మంగీలాల్ పాల్గొన్నారు.

‘నీట్’ నిర్వహణలో అవకతవకలు

మహబూబాబాద్ అర్బన్: నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేసి పరీక్షను రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు పట్ల మధు, ఇరుగు మనోజ్, పి.చరణ్, ఎం.లోకే, బి.మధు, దేవేందర్, రాకేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐక్య విద్యార్థుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్టూడెంట్ మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ ప్రవేశ పరీక్షలో ఎక్కువ మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడం చూస్తేనే పేపర్ లీక్ అయిందని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. పరీక్షల సంబంధించిన అధికారులను వెంటనే బాధ్యతల నుంచి తప్పించి, రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పాలన్నారు. జరిగిన స్కాంకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, వీజేఎస్, ఎన్ఎస్‌యూఐ, ఎఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ అధ్యక్షుడు, కార్యదర్శులు, నాయకులు సూర్యప్రకాశ్, చంటి, నాగరాజు, జ్యోతిబసు, సింహాద్రి, మహేష్, వెంకటేష్, తరుణ్, సాయి, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

నేడు ఈదులపూసపల్లి దర్గాలో ఉర్సు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో గల హజరత్ సయ్యద్ ఇమామ్ షావలి దర్గాలో బుధవారం ఉర్సు ఉత్సవం నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి షేక్ అన్వర్ తాజి నిజామి మంగళవారం తెలిపారు. మానుకోట తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకువచ్చిన సందల్ (గంధం) సమర్పించి హజరత్ సయ్యద్ ఇమామ్ షావలి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉర్సు ఉత్సవం ఘనంగా జరుగుతుందని, కులమతాలకు అతీతంగా వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. మగ్రిబ్ నమాజ్ అనంతరం రాత్రి 7గంటలకు లంగర్(భోజనం) కార్యక్రమం ఉంటుందన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మోసం

నెహ్రూసెంటర్: పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు, ఇంటినంబర్లు కేటాయించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూపోరాట కాలనీ వద్ద మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి కట్టించాలని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పథకాలన్నింటిని అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామంటూ మోసం చేశారని, భూదందాలు, రియల్‌ఎస్టేట్ దందాలతో ప్రభుత్వ భూములన్నీ దోచుకున్నారని ఆరోపించారు. ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, రాగం మల్లయ్య, మిర్యాల మల్లికార్జున్, కోన సత్యం, బాలాజీ, హర్షవర్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రం నుంచి మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన గంగారం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి ఏజెన్సీ, సుదూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆర్టీసీ రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లేందుకు రోజంతా సమయం వృథా అవుతుందన్నారు. కొత్తగూడ వరకు వస్తున్న ఆర్టీసీ బస్సులను గంగారం వరకు పొడిగించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యాకయ్య, రంగయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

కార్మికులకు ద్రోహం చేసినందుకే బహిష్కరణ

బయ్యారం: పెంకు కార్మికులకు ద్రోహం చేసినందుకే టైల్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంసింగ్‌ను బహిష్కరించినట్లు టైల్స్‌వర్కర్స్ జాతీయ ఫెడరేషన్ అధ్యక్షుడు మరికుర్తి ఏసు అన్నారు. మండలంలోని పలు పెంకు పరిశ్రమల కార్మికులతో మంగళవారం నిర్వహించిన సమావేశంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. యజమానులతో కలిసి కార్మిక ప్రయోజనాలను రాంసింగ్ విస్మరించినందుకే బహిష్కరించామని కార్మిక సంక్షేమం కోసం తమ సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య, నాయకులు వీరభద్రం, రాసుద్దీన్, నాగేశ్వరరావు, శేషు, శ్రీనివాస్, సోమిరెడ్డి, ఏసుబాబు, రాజు, లింగయ్య, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవం పోసుకున్న ప్రకృతివనం



వేసవిలో పల్లెప్రకృతి వనం ఇలా..



ప్రస్తుతం పచ్చదనంతో ఏపుగా పెరిగిన మొక్కలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామం సమీపంలోని సూర్యాపేట–మహబూబాబాద్ 365 జాతీయ రహదారికి పక్కన సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. అందులో 59 వివిధ రకాల చెందిన మొక్కలు నాటించి సంరక్షణ చేపట్టారు. ఈక్రమంలో ఈ ఏడాది వేసవి తాపానికి భూగర్భజలాలు అడుగంటుకొని పోయి వనంలో ఏర్పాటు చేసిన రెండు బోర్లలో జలం పూర్తిగా ఎండిపోయింది. దీంతో మొక్కలకు నీరందక ఎండుముఖం పెట్టి చివరి దశకు చేరుకున్నాయి. ‘ఎండిన బృహత్ పల్లె ప్రకృతి వనం’ సాక్షిలో వచ్చిన కథనానికి అప్పుడు స్పందించిన అధికారులు సమీపంలోని ఓ ప్రైవేట్ బావిని కిరాయికి తీసుకున్నారు. బావి నుంచి ప్రత్యేకంగా పైపులైన్ ఏర్పాటు చేసి మొక్కలకు నీటి సౌకర్యం కల్పించారు. వేసవిలో పల్లె ప్రకృతి వనం మొక్కలన్నీ ఏపుగా పెరిగి నేషనల్ హైవేపై ప్రయాణిస్తున్న వాహనదారులతోపాటు బుర్హాన్‌పురం గ్రామ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతున్నాయి.

రేషన్‌షాపును కొనసాగించాలి

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో రేషన్‌షాపును కొనసాగించాలంటూ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సంఘం అధికార ప్రతినిధి సోమారపు శ్రీరాములు మాట్లాడుతూ.. అమీనాపురంలో రేషన్‌షాపు కొన్ని సంవత్సరాలుగా బంద్ కావడంతో, కల్వల, కేసముద్రంస్టేషన్‌లో గల రేషన్ షాపులకు వెళ్లి రేషన్‌బియ్యం తెచ్చుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో రేషన్‌షాపును కొనసాగిస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు. అనంతరం డీటీ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వల్లందాసు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు మందుల కృష్ణమూర్తి, మండల కోశాధికారి మిట్టగడుపుల యాకయ్య పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

బీసీజీ టీకాలపై ఇంటింటి సర్వే

మహబూబాబాద్ రూరల్: బీసీజీ టీకాల వ్యాక్సినేషన్ ఇంటింటి సర్వే బుధవారం నుంచి ప్రారంభమవుతుందని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక అన్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ శిక్షణ కార్యక్రమం మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ నరేష్ సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగులు సక్రి, పుష్పలీల, దండె శ్రీహరి, ఇందిరా, సుభద్ర, గోవిందమ్మ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కురవి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ వైపు నుంచి మరిపెడకు ఆటో వస్తుంది. ఈ క్రమంలో చింతపల్లి గ్రామంలోని కిరాణం షాపు నుంచి బానోత్ శంకర్ అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆటో అతడిని ఢీకొట్టింది. దీంతో శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈక్రమంలోనే కిరాణం షాపులో సరుకులు తీసుకునేందుకు మరిపెడ మండలం ఎర్జర్ల శివారు గుర్రపుతండాకు చెందిన వ్యక్తులు అంతకుముందుగా ద్విచక్రవాహనం స్టాండ్ వేసి రోడ్డు పక్కన ఉన్నారు. శంకర్‌ను ఢీకొట్టిన ఆటో ముందుకు దూసుకెళ్లి స్టాండ్ వేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా బైక్ వద్ద ఉన్న గుర్రపు తండాకు చెందిన ఎస్.నందినికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన క్షతగాత్రులను జాతీయ రహదారి అంబులెన్స్‌లో మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై విజయ్‌రాం కుమార్ మంగళవారం తెలిపారు.

బదిలీలు చేపట్టకుండా జాప్యం



మాట్లాడుతున్న వీరస్వామి

గంగారం: ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖలో తక్షణమే బదిలీలు చేపట్టాలని టీడబ్ల్యూటీసీ జిల్లా నాయకులు వాసం వీరస్వామి అన్నారు. మండలంలోని గిరిజన సంక్షేమ బాలికలు పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ సమావేశం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ప్రస్తుతం జరుగుతున్నాయని, కాని గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం బదిలీలు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డి.రాములు, పూణెం పూర్ణచందర్, భద్రులాల్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి సరఫరాపై మహిళల ఆగ్రహం

బయ్యారం: మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని మండలంలోని కొత్తపేట పంచాయతీలోని హేమ్లాతండాకు చెందిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా తాగునీరు సక్రమంగా ఇవ్వకపోవడం వలన ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు భగీరథ సిబ్బందితో గొడవకు దిగారు.

సర్వే పరిశీలన

దంతాలపల్లి: ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ నల్లాల పనితీరుపై ఆయా గ్రామాలలో పంచాయితీ కార్యదర్శులు నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ వివేక్‌రామ్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని బొడ్లాడ, బీరిశెట్టిగూడెం గ్రామాలలో సర్వే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్‌పాష, కార్యదర్శి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి

తొర్రూరు: ఉపాధ్యాయుల పదోన్నతులపై ప్రక్రియ పూర్తి చేయాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు రాయిపెల్లి యాకయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కొత్త ప్రభుత్వమైన పదోన్నతుల ప్రక్రియను వెంటనే పూర్తి చేసేవిధంగా చర్య తీసుకోవాలని కోరారు.

కలుషిత నీరు సరఫరా



గార్ల: గార్ల పట్టణంలో 3రోజులుగా కుళాయిల ద్వారా కలుషిత నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ల మరమ్మతుల దృష్ట్యా 3 రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా బంద్ కావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది పాకాల ఏరు సమీపంలోని గార్ల రక్షిత మంచినీటి పథకం ద్వారా ఏటి కలుషిత నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేశారు. ఈ నీటిని తాగలేక ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్‌కు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఇట్టి విషయంపై మిషన్ భగీరథ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని ‘సాక్షి’ వివరణ కోరగా మిషన్ భగీరథ పైపులైన్లు, ఫిల్టర్లను సిబ్బంది మరమ్మతు చేస్తున్నారని, నేటి నుంచి మండలానికి మిషన్ భగీరథ తాగునీరు కుళాయిల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

కేసముద్రం: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మట్టతమ్మాల్ అలివేలుమంగమ్మ(85) మూడురోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. ఈక్రమంలో మంగళవారం గ్రామ సమీపంలో గల వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించడంతో, అలివేలుమంగమ్మగా స్థానికులు గుర్తించారు. దీంతో సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.


వైభవంగా ‘సందల్’ ఊరేగింపు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు, తహసీల్దార్ భగవాన్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: బక్రీద్ పండుగ అనంతరం ముస్లింలు భక్తిశ్రద్ధల మధ్య తీసుకెళ్లే సందల్ (గంధం), ఖందిల్ ఊరేగింపు కార్యక్రమం మంగళవారం రాత్రి మానుకోటలో వైభవంగా జరిగింది. సంప్రదాయంగా వస్తున్న ఆనవాయితీ, ఆచారం ప్రకారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ భగవాన్ రెడ్డి ఆధ్వర్యంలో సయ్యద్ ఇమాంషావలీ దర్గాలో సమర్పించేందుకు తీసుకెళ్లే సందల్‌కు ముస్లిం మతపెద్దలు అబ్దుల్ హమీద్, మహ్మద్ సయీద్ అహ్మద్ రిజ్వీ ప్రత్యేక పూజలు నిర్వహించి ఫాతేహషరీఫ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఆర్ఐలు కృష్ణప్రసాద్, బషీర్, సిబ్బంది గంధాన్ని తలపై తీసుకువచ్చి ఇమాంషావలీ దర్గాకు సాగనంపారు. ముందుగా గౌసియేపాక్‌చిల్లా జెండా గద్దెల వద్ద కూడా గంధాన్ని ఉంచి ఫాతియాలిచ్చి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖందిల్‌తోపాటు ఈ రెండురకాల గంధాన్ని ఈదులపూసపల్లిలో గల ఇమాం షావలి దర్గాలో బుధవారం సమర్పించనున్నారు. ఇదే రోజున ఈ ప్రాంతంలో ఘనంగా ఉర్సు ఉత్సవం జరుగనుంది. కార్యక్రమంలో ముస్లింలు హారుణ్, జమీల్, ఖలీల్, ఆసిఫ్ అలీ ఫకీర్, ఇస్మాయిల్, ఖైసర్, ఫయాజ్, యాకుబ్, జిలానీ, వాహెద్, చాంద్, ఎక్బాల్, రెహ్మాన్, గౌస్, దస్తగిరి, ఖాజాపాషా, వాజీద్‌పాషా, ఆదిల్, వాహెద్, సిద్దిక్, చాంద్, ఉమర్, రహమాన్, సర్వర్, ఫజల్, ఖైసర్, ఈదులపూసపల్లి దర్గా ముతవల్లి అన్వర్, ఫరీద్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు



పెద్దవంగర: ఎకో క్లబ్ కార్యాచరణలో భాగంగా పాఠశాల ఆవరణంలో కిచెన్ గార్డెన్ చేపట్టనున్నట్లు ఎకో క్లబ్ ఇన్‌చార్జ్ టీచర్ కొక్కుల శ్రీధర్ తెలిపారు. క్లబ్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులు నేలను చదును చేసి ఉపాధ్యాయుల సాయంతో కిచెన్ గార్డెన్‌ను తయారు చేశారు. ఇంటి నుంచి తీసుకువచ్చిన బెండ, బీర, సోర, కాకర, దొండ వంటి పలు రకాల విత్తనాలను ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌లో విత్తారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెరటి తోటల పెంపకంతో పురుగు మందులు, రసాయన ఎరువులు వాడని తాజా సేంద్రియ కూరగాయాలు, ఆకుకూరలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, అంజయ్య, పాషా పాల్గొన్నారు.